# విధి లిఖించిన వెర్రిచిత్రం

ముంగర శంకరరాజు



శేషాచలం సానువులు. తలకోన అడవి. దూరాలకు విస్తరిల్లిన దట్టమైన ప్రాంతం.

ఆ ఘనారణ్యంలో తలకోన జలపాతం, శివాలయం, ఫారెస్టు బంగళా - ఒకదాని కొకటి దూరం దూరంగా ఉండాయి. ఫారెస్టు బంగళాకు రెండు కిలోమీటర్ల దూరంలో నెరబైలు బస్తీ.

డిసెంబరు నెల. తెల్లవారుజాము.

లోయలు, కొండలు, అడవులు పొగ మంచుతో మునిగి ముద్దగా తడుస్తుంటాయి. మంచు మొయిళ్ళు గుములు గుములుగా చెట్లను ఒరుసుకొని పరుగిడుతుంటాయి. మసక మసక వేకువ.

తల్లి ఒడిలో నుండి వస్తున్న అడవి బిడ్డలా ఆ వ్యక్తి చీకిపొదలు, బోదగంటలు పక్కలకు నెట్టుకుంటూ అడవి లోతట్టు నుండి ముందుకు వచ్చాడు. తిన్నగా చెట్లు పల్చబడుతూన్న ప్రదేశానికి చేరుకున్నాడు. మంచు తెరల చాటున మెత్తని పులిలా మెల్లగా మైదానం వైపు ముందుకు సాగాడు. మరి కొంత మేర నడిచాడు. త లెత్తి చూశాడు.

రక్తచందనం చెట్లు, టేకు మాన్లు, నర్సరీ మొక్కల మధ్య ఫారెస్టు బంగళా మసక మసగ్గా కనబడింది. కుడి ఎడమల జాగ్రత్తగా చూసుకుంటూ బంగళాను సమీపించాడు. బంగళా తలుపులన్నీ మూసి ఉన్నాయి. పోర్టికోలో ఒక బల్బు మాత్రం గుడ్డిగా వెలుగుతూంది. కారు షెడ్డు ఖాళీగానే ఉంది. ఆఫీసర్లు గానీ, యాత్రికులు గానీ కాంపు చేసినట్లు లేదు. మనుష లెవరూ లేరన్న నమ్మకం కలిగింది.

అతడు బంగళాను పరీక్షగా ఓమారు ప్రదక్షిణ చేసి, దక్షిణంగా కాంపౌండు గోడకు ఆనుకొని ఉన్న వాచ్‌మాన్ షెడ్డు ముందుకు వచ్చి నిలబడ్డాడు. చేతి గడియారం చూచుకున్నాడు. ఇంకా అయిదు కాలేదు. లోకం చలికి ముడుచుకొని పడి ఉంది.

ఆయన షెడ్డు రేకు తలుపుమీద చిన్నగా తట్టినాడు.

"ఎవ్వరూ?" లోపల్నుంచి కిట్టప్ప పలకరింపు.

జవాబుగా ఆగంతకుని పొడి దగ్గు.

గొంతు పరిచితమైందే! ముసుగు తన్ని పడివున్న వాచ్‌మాన్ కిట్టప్ప గబాల్న పైకి లేచి వచ్చి తలుపు తీశాడు.

గుమ్మం ముందు మంచులో మసక చీకట్లో నిలబడి ఉన్న ఆరడుగుల విగ్రహం - పాంటు, ఫుల్ షర్టు, కాళ్ళకు కాన్వాసు షూ, చంకలో లెదర్ బాగ్, ఒంటినిండా కప్పుకున్న తెల్లటి ఉన్ని శాలువ, నల్లటి కళ్ళజోడులో చంద్రం.

"అయ్యా! మీరే అయ్యుంటారని గొంతు బట్టి గుర్తించా" అంటూ కిట్టప్ప ఆయన్ను లోపలికి తీసుకొని మళ్ళీ తలుపు మూసి - "శానా కాలమైంది సూసి. యెప్పు డొస్తిరి? బాగా?" అంటూ సంబరంగా పలకరిస్తూ చాపతుండు పరిచి "కూకోండి" అన్నాడు ఆదరంగా.

"కిట్టప్పా!"

"అయ్యా!"

"మరేం పరవాలేదా? ఎవరూ రారు గదా!" అడిగాడు సాభిప్రాయంగా.

"మరేం తొంద రుండదయ్యా. మీ రొచ్చిన సంగతి సీమగ్గూడా తెలీకుండా సూసుకుంటా...

"రేంజర్లు, గారుడ్లు, వాచర్లు, ఫారెష్టు దొరలు బంగళాలో మూడ్రోజులు మకాం పెట్టుండారు. జలసాలు సేసిండారు. మూడు లారీల సరుకు [రక్త చందనం] బోడ్డరు దాటించిండారు. దండిగా దుడ్డు దండుకొని జీపు లెక్కి నిన్ననే చిత్తూరుకి పోయుండారు. ఇంకో వారం దాకా ఆళ్ళు ఈ పక్క అడుగు పెట్టరు. మరేం బయం ఉండదు. కూకోండయ్యా. అన్నీ నేను జూసుకుంటా..."

"యేయ్! లెగవే!" అంటూ దుప్పటి లాగి భార్యను లేపినాడు. "అయ్య వచ్చిండు..." అంటూ ఆమె చెవిలో చిన్నగ చెప్పినాడు.

చెల్లమ్మ కొడుకు రాముల్ని పక్కకు జరిపి లేచి, చంద్రానికి దండం పెట్టి గోడవార నిలబడింది - నిద్రమబ్బులో కళ్ళు నులుముకుంటూ.

చాపమీద చలికి మోకాళ్ళు ముడుచుకొని పడి ఉన్నాడు రాములు.

"అరే, రాములు పెద్దో డయ్యాడే! బళ్ళో చేర్పించారా? ఏం చదువుతున్నాడు?" అన్నాడు చంద్రం నిద్రబోతున్న రాములు తల మెత్తగా తడుతూ.

"సదువా సట్టుబండా! పిల్లోడు ముదిరిపోతుండె. బడి కేద్దామంటే ఈ మొండి మనిషి సత్తే ఒప్పుకోడు. మామకు మీరన్నా సెప్పి సూడండి చంద్రన్నా. మనసు మళ్ళించుకుంటాడేమో!" చెల్లమ్మ చెప్పింది బాధగా.

"సూడం డయ్యా. కొడుకును సదవేసి కలకటేర్ని సెయ్యాలని నా బాసేల్ది అన్తమానం ఒకే సణుగుడైంది.


"ఒసే యెర్రి మొగమా! కాలం గాలివాటం నీకేం యెరుకే! ఈ కాలం సదువులు సాకిరేవు గ్గూడా పనికిరావు. సదూకొని ఉజ్జోగాలు సేసేటోళ్ళు యేం బావుకుంటుండారని? సెల్లా, నా కొడుకును లారీ డైవరు సేత్త. వారానికి రెండు లోడ్లు. బాట దాటించాడంటే పది వేల రొక్కం గల గలా సేతిలో పడుతుంది. అట్లా అయిదేళ్ళు రవాణా సాగించాడా అయిదు లచ్చలు యెనకేసుకుంటాడు. దుడ్డుంటే వాడేసే దొర! రాములు మీసం మెలేసి యెలచ్చంలో నిలబడతా డు. యెమ్మెల్లే అగుతా డు. మంతి రగుతా డు. ముఖ్యమంతిరే అయి కూచుంటాడు. అంతే... ఇంగ నోర్మూసుకొని పడుండు" అన్నాడు కిట్టప్ప ధీమాగా.

'అదీ నిజమే కావచ్చు' - అన్నట్లు చంద్రం తలూపాడు ముసి ముసిగా నవ్వుకుంటూ.

"యేందే సెల్లా, ఇంగా అట్లా నిట్రాతి గుంజలా నిలబడుండావు. అయ్య రేతిరంత సల్లో యాడ వుండినారో! యెంత దూరం నడిచిండారో! ఇద్దో, బేగీ పాలు పిండి అయ్యకు ఉడుకుడుకు కాఫీ చేసివ్వు. అయ్యా! మీరు కాఫీ త గుతూ ఉండండి. సిటికెలో నేను మ నింటి కెళ్ళి అమ్మకు మీ రొచ్చిన సంగతి సెవిలో పడేసి వత్త" అని చెప్పి, కిట్టప్ప ఆదరాబాదరా సైకిలు మీద బస్తీకి బైలుదేరినాడు.

నిమిషాల మీద నెరబైలు చేరినాడు. చంద్రం ఇంటి తలుపు తట్టినాడు.

సీతమ్మ తలుప్పు తీసింది - "ఏం కిట్టప్పా,



బాగు?న్నావా? రా లోపలికి. పొద్దున్నే ఏం విశేషం?" అని అడిగింది.

కిట్టప్ప అటూ ఇటూ చూసి మెల్లిగ లోగొంతుతో - "అయ్యా వచ్చుండా రమ్మా! చెప్పి పోదామని వస్తిని."

నడిరేయి చిమ్మచీకటిలో నెలవంక దర్శనం! ఊహించని సుఖవార్త! సీతమ్మ సంతోషంతో ఉబ్బి తబ్బిబ్బయింది. మొగుని జ్ఞాపకంతో మేను పులకించి మొగం జేవురించింది. అబ్బా! ఎన్నాళ్ళకు ఎన్నేండ్లకు మేం ఆయనకు గుర్తొచ్చాం?

"కిట్టప్పా! ఎప్పు డొచ్చినారు? ఎక్క డున్నారు? ఎట్లున్నారు?" అడిగింది ఆత్రం, ఆదుర్దా నిండిన కంఠంతో.

"ఇప్పుడేమ్మా! ఓ గంటకు ముందు. బంగళా

కాడ ఉండారు. తొలిగా మీకు చెప్పుదామని తొందరగా వచ్చేస్తిని."

"మనిషి బాగా చిక్కిపోయారా?"

"లేదమ్మా! మామూలుగానే ఉండారు. ఒంటికి కొంచెం నలుపు రంగు వచ్చింది. అంతే... కానీ మీరేం టమ్మా మరీ డీలా పడ్డట్లు కన్పిస్తుండారు!"

"నాకేం కిట్టప్పా బాగానే ఉన్నాను. సరే చంద్రం ఏం చెప్పారు? బాబును అడిగారా?"

"యాడ? ఆయన రావడం, నేను ఈడికి పరిగెత్తడం జరిగింది. మంచి చెడూ మాట్లాడింది యాడ? సరేమ్మా! నేం మళ్ళా పత్త. ఆయన ఆడ కానుకొని ఉంటారు" అన్నాడు కిట్టప్ప వెళ్ళే తొందరలో.

"కిట్టప్పా, రాత్రి ఎక్క డుండినారో, ఏ అడవిలో గడిపారో, ఏమైనా తిన్నారో, లేదో! ఆకలి - దప్పి - ఎండా - వానా - నిద్రా - ఏదీ పట్టించుకోని మహానుభావుడు. ఆయన తీరే అంత. కిట్టప్పా కొంచెంసేపు ఆగు. టిఫిన్ చేసిస్తా. పట్టుకపోదువుగాని."

"ఒద్దు తల్లీ! మ నింటికాణ్ణుంచి తీనకపోతే ఎవరైనా అనుమానిస్తారు. మల్లా అ దో తలనొప్పి యవ్వారం!" అపద ఎరుక చేశాడు కిట్టప్ప.

"ఔను. మరిచాను. నువ్వు చెప్పేదీ నిజమే!" అంటూ ఆమె గదిలోకి వెళ్ళి వచ్చి, రెండు పది రూపాయల నోట్లు కిట్టప్ప చేతిలో పెట్టి - "నాయరు హొటల్లో ఇడ్లీలు, దోసెలు, వడలు తీసుకపో కిట్టప్పా. మధ్యాహ్నం భోజనం కూడా అక్కడనుండే పట్టుకపో. కానీ రాత్రికి మాత్రం చీకటి పడుతూనే తప్పకుండారా, భోజనం కారియర్‌లో పెట్టి ఉంటాను. ఇంటి వంట తిని ఎంత కాలమైందో ఆయనకు" - అని చెప్పింది విచారపడుతూ.

కిట్టప్ప వెళ్ళిపోయాడు.

సీతమ్మ వాకిట్లో నిలబడి సైకిలుమీద బిర్రున పోతున్న కిట్టప్పను అన్యమనస్కంగా చూస్తూండిపోయింది.

మెలమెల్లగా ఆమె మనసులో ఆలోచనలు, ముఖంలో విచార రేఖలు, గుండెలో గుబులు అలుముకున్నాయి.

ఆయనకోసం, ఆయన రాకకోసం, ఆయన్ను చూడ్డం కోసం నిరంతరం పరితపించి పోతూంది. ఉచ్ఛ్వాస, నిశ్వాసాల్లా ఎడతెగని నిరీక్షణ సాగిస్తూంది.

తీరా ఆయన వస్తారు. సంవత్సరానికో, రెండు సంవత్సరాలకో తగిలీ తప్పీ ఒకమారు వస్తారు. తలకోన చెట్లల్లో ఉంటారు. ఇంటికి కబు రంపుతారు. వీలుపడితే నిశివేళ జనం కంట బడకుండా నిశ్శబ్దంగా ఇంటికి వస్తారు. రెండు మూడు గంటలు ఇంటిలో గడుపుతారు. తిరిగీ తెల్లారకముందు చీకట్లో వెళ్ళిపోతారు. ఆయన రావడం, పోవడం అంతా ఓ కలలా మిగిలిపోతుంది.

అలా ఆయన వెళ్ళిపోగానే పోలీసులు వాసన పడతారు. ఇంటిమీద కొచ్చి దూకుతారు.

'ఎక్కడ చంద్రం? ఎప్పు డొచ్చినాడు? ఎక్కడికి పోయినాడు? ఆయన సంచారం నీకు తెలీకుండా ఉంటుందా?' అంటూ గుచ్చి గుచ్చి ప్రశ్నలు, వేధింపులు, శోధింపులు! వారి ఆగడాలకు ఓ వేళా పాళా అంటూ ఉండదు. కడుపుకు తిండీ, కంటికి నిద్రా, బిడ్డకు పాలూ పట్టనివ్వరు. పోలీసులు, సి.ఐ.డి.లు, టాస్క్ ఫోర్సు వారం, పది రోజులు మానసికంగా చిత్రవధ చేస్తారు.

హమేషా ఇంటిమీద పోలీసు నిఘా. ఇరుగూ పొరుగూ తెలిసిన వారూ ఈ ఇంటి చాయలకే రావడానికి జడుసుకుంటారు. కడకు పనిమనిషిని కూడా పీడిస్తారు.

'ఇసింతకు అసింతకు టేషన్‌కు రమ్మని జబర్దస్తీ చేత్తరమ్మా. మీ ఇంట్లో మేం పని చెయ్యలేం' అంటారు. పనిమనిషి కూడా కరువైంది. 'వెలివేసినట్లు ఒంటరి దాన్ని. దిక్కూ తోడూ లేదు. కడకు ఎక్కడా జరుగుబాటులేని బువ్వమ్మ - సాయబు లామె - తెగించి పనికి కుదిరింది. మంచి నమ్మకస్తురాలు. ఇప్పుడు నాకు తల్లి తోడుగా ఉంది.'

"ఏమ్మా, ఇంకా పాలు పిండలేదా? బాబు లేస్తే ఆకలికి గీపెట్టి యేడుస్తాడు. పద్దా, నేను ఇంటిముందు పేణ్ణీళ్ళు జిలకరించి వస్తా" అన్న బువ్వమ్మ పలకరింపుతో సీతమ్మ ఆలోచన నుండి తేరుకున్నది.

తిన్నగా దొడ్డిలోకి వెళ్ళి దూడను వదలిపెట్టింది చేపుకు. చెంబుకోసం ఇంటిలోకి వెళ్ళింది. బాబు మంచంమీద నిద్రపోతున్నాడు. ఆమె బాబూ మీదికి వంగి - 'నా నొచ్చారంటరా బుజ్జీ!' అంటూ కొడుకును ముద్దాడింది. ఆ ముద్దుతో ఇందాకటి వేడినుండి ఆమె మనసు చల్లబడింది. హృదయం ఉల్లసితమైంది.

చెంబు తీసుకొని బయట కొచ్చింది. పేడ చేతులతో బువ్వమ్మ ఎదురొచ్చింది. సంతోషం పట్టలేక ఆమెను వాటేసుకుంది.

"బువ్వమ్మా! ఆయన వచ్చారంట!" అంటూ తల్లి లాంటి బువ్వమ్మ ఎదమీద చెంప చేర్చి ఆనంద బాష్పాలు రాల్చింది.

'తన వాడికై బిడ్డ ఎంతగా బెంగెట్టుకుందో పాపం' అనుకున్న బువ్వమ్మకు కళ్ళు చెమ్మగిల్లాయి - ఆ సందర్భంలో.

"దూడ పాలన్నీ తాగేస్తూంది కదమ్మా!" మెత్తగా చెప్పింది బువ్వమ్మ.

సీతమ్మ తెప్పరిల్లింది. "బువ్వమ్మా! ఈ రోజు నంత కదా! మంచి మంచి కూరగాయలు కొనుక్కురా. ఆ( కాకరకాయలు తేవడం మర్చిపోవద్దు. అవంటే ఆయనకు బలే ఇష్టం" అంటూ ఆవు దగ్గరికి వెళ్ళింది.

** ** **

జలపాతా నికి కొద్ది దూరంలో గుబురు పొదల నడుమ ఓ రాతి గుండుమీద కూర్చున్నాడు చంద్రం. పొద్దు బాగా పైకొచ్చింది. మంచు పొరలు వీడిపోయాయి. నీటిబొట్లు రాలుస్తూ పచ్చని చెట్లు - లే ఎండలో మిల మిలా మెరుస్తున్నాయి. జలపాతం హొరు, అడవి దోమల రొద, పావురాళ్ళ కువకువలు, కుందేళ్ళ దూకుళ్ళు - అడవి సందడిగా ఉంది. ఆయనలో ఆలోచనల అలజడి.

తాను అజ్ఞాతంలోకి వెళ్ళిన ఏడేండ్లలో ఎక్కువ కాలం అడవుల్లోనే గడిపినాడు. తాను సంచరించిన శేషాచలం, శ్రీశైలం, భద్రాచలం, సింహాచలం అడవులకంటే ఈ తలకోన అడవి ఓ ప్రత్యేకమైంది. తనకు బాగా ఇష్టమైంది. బహుశా తను పెట్టి, పెరిగిన తల్లి చోటు అయినందువల్లనేమో!

అమ్మా నాన్నకు తా నొక్కడే. అదీ తలకోన ఈశ్వరుని వరప్రసాదంగా పుట్టినాడంట. అందుకే చంద్రమౌళి అని పేరు పెట్టుకున్నారు. తన చిన్నప్పుడే అమ్మ కాలమైపోయింది.

ఇల్లూ, మడీ, చేనూ, తోట - కలిగిన సుమారు పాటి స్థితిపరుడు నాన్న. తనమీద పంచప్రాణాలు పెట్టుకొని తన అభివృద్ధికి అన్ని విధాలా కృషి చేశాడు. తన్ను యెమ్మెస్సీ వరకు చదివించినాడు. తాను ఉద్యోగం చెయ్యాలని నాన్న కోరలేదు. ఇంటిపట్టున ఉండి సేద్యం చేయించుకుంటూ ఆయన కళ్ళముందు తిరుగాడుతూ ఉంటే చాలు ననుకున్నాడు.

విద్యార్థి దశలోనే తన్ను అభ్యుదయ వామపక్ష భావాలు బాగా ఆకట్టుకున్నాయి. ఓ పక్క చదువు



సాగిస్తూ, మరో పక్క రాడికల్స్‌తో చేరి రైతు, కూలీ, విద్యార్థి ఉద్యమాల్లో విరివిగా పాల్గొంటూ ఉండేవాడు.

రాజకీయాల నుండి తన్ను తప్పించాలనీ, తన మనను మార్పించాలనీ నాన్న పట్టు పట్టి సీతతో పెండ్లి జరిపించాడు. ఆయన మీద ఉండే గౌరవాభిమానం కొద్దీ తను కాదనలేకపోయాడు.

అయినా తాను తీవ్రవాదం లోతుల్లోకి మరీ చొచ్చుకపోవడంతో, తనమీద బెంగతో, దిగులుతో నాన్న గుండెపోటు తెచ్చుకున్నాడు.

తాను అండర్ గ్రౌండులో ఉంటూ ఒకసారి వేలూరు ఆసుపత్రికి వెళ్ళి నాన్నను చూశాడు. "చంద్రా! నాకు కూతురు, కొడుకు, కోడలు అంత సీతమ్మే. ఆ బిడ్డను విస్మరించవద్దు" అన్నాడు. పిమ్మట కొద్ది రోజులకే ఆయన కన్ను మూసినట్లు తెలిసింది. తాను ఈ ప్రాంతం వదలి ఏజెన్సీకి వెళ్ళిపోయినాడు.

సెంట్రల్ ఆర్గనైజేషన్ స్టీరింగ్ కమిటీ ఈమధ్య మన్యంలో మీటయింది - "ఉత్తరాంధ్ర తెలంగాణాల్లో తీవ్రవాద ఉద్యమం బాగా విజయం సాధించింది. అనేక జిల్లాలు కైవసమైనాయి. పోరాట దశ దాటి పాలించుకునే దశకు వచ్చేసాము: ఇకమీదట రాయలసీమ వైపు మన దృష్టి మళ్ళించాలి. ఆరేండ్లుగా ఆ ప్రాంతంలో ఉద్యమం పట్టు కోల్పోయి చప్పబడిపోయింది. అక్కడ పోరాట ఉద్యమానికి తిరిగీ ఊపిరి పోయాలి. ఇంతకాలం ఉత్త రాంధ్ర పోరాటాల్లో నిమగ్నమై ఉన్న - రాయలసీమకు చెందిన లీడర్లు, కాడర్లు, ఆర్గనైజర్లు తమ ప్రాంతానికి వెళ్ళి ఉద్యమ స్ఫూర్తికి కృషి చేయవలసి ఉంది. వీలునుబట్టి కార్యకర్తలు అజ్ఞాతంగానో, బహిరంగంగానో జనంతో కలిసి కృషి చేయాలి" అని ఆర్గనైజేషన్ అభిప్రాయపడింది. ఈ నేపథ్యంలో తాను సొంత జిల్లాకు రావడం. వారం రోజులు జిల్లాలో పర్యటించాడు. వ్యక్తులను కలుసుకున్నాడు. ముఖ్యంగా మాస్టారితో సంప్రదించాడు.

"తిరుగుబాటు, హత్యలు, దోపిడీలు లాంటి తీవ్రమైన నేరాలు నీమీద ఉన్నాయి. త్వరపడి బయటపడవద్దు. జాగ్రత్త!" అని హెచ్చరించారు మాస్టారు.

పరిశీలించగా ఈ ప్రాంతం పరిస్థితు లేమంత సానుకూలంగా లేవు. తన ఉనికి నిష్ప్రయోజనమే అనిపిస్తోంది. కొంత కాలం సెంట్రల్‌కే వెళ్ళడం మంచి దనుకుంటున్నాడు - అని చంద్రం తన గత వర్తమానాల్ని నెమరువేసుకుంటూ కూచున్నాడు.

కిట్టప్ప టిఫిన్ పొట్లాలు పట్టుకొని, రాములున్ని భుజంమీద ఎక్కించుకొని చంద్రం వద్దకు వచ్చాడు.

** ** **

సీతమ్మ పాత స్వెట్టర్ కుట్లు వేస్తూ గడపలో కూర్చొని ఉంది. పొద్దుటినుండి ఆమె ఆలోచనలు చంద్రం చుట్టే పరిభ్రమిస్తున్నాయి.

తండ్రి బలవంతంమీద పెళ్ళి చేసుకున్నా చంద్రం తన్ను మనను నిండా, ఆత్మ నిండా అక్కున చేర్చుకున్నాడు. రెండు సంవత్సరాల కాలం మా దాంపత్యం హాయిగా గడిచింది. కొత్తలో కొంతకాలం బిడ్డలు వద్దనుకున్నారు.

కానీ, అప్పటికే ఆయనలో అంతర్వాహినిగా ఉన్న విప్లవ భావ తీవ్రత ఆయన నిగ్రహాన్ని పెకలించుకొని పెల్లుబికింది. మొదట రాడికల్‌గా, పిమ్మట తీవ్రవాదిగా, తిరుగుబాటుదారుగా, ఆపైన నక్సలైటుగా ప్రభుత్వ దృష్టిలో స్థిరపడిపోయారు. పోలీసు వేట ముమ్మరమైంది.

ఫలితంగా ఆయన తన్ను దాటి, ఇల్లు దాటి, ఊరు దాటి అడవుల్లోకి అజ్ఞాతవాసంలోకి దూసుకపోయారు. అప్పటినుండి తమకు ఏడేండ్లుగా ఎడబాటే.

కాలం గడిచేకొద్దీ తిన్నగా తెలిసొచ్చింది - ఆయన్ను చేజార్చుకోవడం ఎంత మూర్ఖత్వమో అని. ఆయన అడవి బతుక్కంటే ఇక్కడ తన ఇంటి బతుకు మరీ దుర్భరంగా తయారయింది.

ఆదిలోనే ఆయన్ను ఆ మార్గం నుంచి తప్పుకోమని ఎంతో చెప్పి చూచింది.

"సీతా! ఉద్యమం నా ఊపిరి. విప్లవం నా ప్రాణం. ఈ పోరాటంలో నాకు తపన ఉంది. త్యాగ ముంది. మంచి లక్ష్య ముంది. ఈ చారిత్రక కర్తవ్య నిర్వహణలో నే నొక్కడే కాదు, వేలాది మంది యువకులు ఉద్యమ స్ఫూర్తితో ప్రాణ లొడ్డి పోరాడుతున్నారు. కోట్లాది జనం శ్రేయస్సుతో ముడివడిన ఈ ఉద్యమం నుండి నేను తప్పుకోవడం అంటూ జరగదు. అది అసంభవం. ఈ సాయుధ పోరాట యజ్ఞానికి న న్నే సమిధగా సమర్పించుకో" అన్నారు నిర్ణయాత్మకంగా.

చంద్రం మనసు మంచిది. మనిషి మంచివారు. నిష్కపటి. గొప్పగా చదువుకున్న వ్యక్తి. ఆయనమీద నాకు కొండంత నమ్మకం కద్దు. ఆయన ఏమి చేసినా, ఏది తలపెట్టినా అది ఉన్నతంగా, ఉచితంగా ఉంటుందని తన ప్రగాఢ విశ్వాసం. కాబట్టి ఆయన ఆశయానికి తాను అడ్డుపడలేదు. మూర్ఖంగా ప్రతిఘటించనూ లేదు. అదీగాక నీటిని మరీ మరగబెడితే ఆవిరైపోతుంది. గట్టిగా అడ్డుపడితే ఆయన శాశ్వతంగా తన్ను తప్పుకోవచ్చు - అన్న భయం కూడా కద్దు.

మధ్య తరగతి గృహిణి సమస్యకు తల వంచడం తప్పనిసరి!

సాయంత్రం అయిదు కావచ్చింది. అందాకా వీధిలో ఆడుకుంటున్న బాబు ఆమెకు వెనుకతట్టుగా వచ్చి ఆమె వీపుమీద కెక్కినాడు. తల్లి మెడ చుట్టూ చేతులు వేసి - "ఎవరిదమ్మా ఇంత పెద్ద స్వెట్టరూ?" అడిగాడు ఆసక్తిగా.

"మీ నాన్నది బాబూ!" చెప్పింది స్వెట్టర్ మడతబెడుతూ.

"అయితే నాన్న వత్తాడా? ఎప్పు డొత్తాడే?"

"వస్తారు. తొందరలోనే వస్తారు."

"మరి నాన్న వత్తే నాకు తుపాకి తెత్తాడు. నిజం తుపాకి తెత్తాడు. నేం తుపాకితో పోలీసోల్లను టప్ టప్ కాల్చి పారేత్తా."

"ఒరే బుజ్జీ అట్లా అనకురా! పోలీసోళ్ళు వింటే నిన్ను పట్టుకపోతారు."

"బలే, నేను చిక్కితేగా! పరిగెత్తి నాన్న దగ్గరికి పోతా. అడవిలో దాక్కుంటా."

బాబు మాటకు సీతమ్మ అదిరిపడింది. అజ్ఞాత భీతితో ఆమె గుండె జల్లుమంది.

"కన్నా! నువ్వూ నన్ను వదలిపెట్టి వెళ్ళిపోతావా? వద్దు బాబూ, ఇం కెప్పుడూ అట్లా అనకు. నేను వినలేనురా!" అంటూ బాబును ఎదకు హత్తుకొని ఈ చెంపా ఆ చెంపా ముద్దాడింది. ఆ సందర్భంలో సీతమ్మకు తాను ఇంటరులో చదివిన ఉపవాచకం - యశోధర కథ లీలగా గుర్తొచ్చింది.

యశోధర యువరాణి. సిద్ధార్థుడు యువరాజు. యశోధరకు మొదటి కాన్పు జరిగింది. మగబిడ్డను ప్రసవించింది. బిడ్డను చూచుకొని మురిసిపోయింది. ఇంతలో ఓ దారుణం - సిద్ధార్థుడు అకస్మాత్తుగా భార్యా బిడ్డలను వదిలేసి, చెప్పా పెట్టకుండా అరణ్యాలకు వెళ్ళిపోయాడు.

ఆమె మనసు వికలమైంది. హృదయం వక్కలైంది. జీవితమే వ్యర్థమైంది. ఆ బిడ్డ తల్లి కట్టుకున్న వానికోసం కన్నీరు వదులుతూ, కన్న బిడ్డకు పాలు కుడుపుతూ పెద్ద కాలం బాధతో గడిపింది.

ఇరవై ఏళ్ళకు సిద్ధార్థుడు బుద్ధుడై వచ్చినాడు. బౌద్ధ ధర్మం ఉపదేశిస్తూ ఊరికి వచ్చినాడు. ఇంటి ముందు కొచ్చి నిలబడినాడు. తల్లినుండి బిడ్డను వేరుచేసి తనతో తీసుకెళ్ళినాడు. సన్యాసం ఇప్పించి సంఘంలో చేర్పించినాడు.

ఇది ఏనాటి కథో! కానీ ఎందరిలోనో ఈనాటికీ జీవిస్తూ ఉంది.

ఆ కాలంనుండి ఈ కాలం వరకూ ఆడబతుకు తీరు ఇంతేనా? స్త్రీ తన జీవితాన్ని రెండు భాగాలుగా చేసి, ఒక భాగం భర్తకూ, రెండో భాగం బిడ్డలకూ సమర్పించుకోవడమేనా? పోతే ఆమె తనకుగా ఏమి మిగుల్చుకుంటుంది? శూన్యం - శోకం - సహనం - శావం - అంతే!

చీకటి ముదిరింది. చలి ఎక్కువైంది. సీత బాబుకు అన్నం తినిపించి మంచంమీద పడుకోబెట్టింది. రాత్రి ఎనిమిది కొట్టింది. కిట్టప్ప వచ్చినాడు.

"కిట్టప్పా! కారియర్‌లో అన్నం పెట్టాను. ఆయనకు ప్రియమైన మసాలా కాకరకాయ, ఉలవచారు చేశాను. కారియర్ పట్టుకెళ్ళు. ఇదిగో ఈ స్వెట్టర్ కూడా తీసుకెళ్ళి ఆయన కివ్వు. చలికాలంగా వెచ్చగా తొడుక్కుంటారు. కిట్టప్పా! మరో మాట. కొంచెం నువ్వుల నూనె, శీకాయ పొడి ఇస్తాను. రేపు బంగళాలోనో, లేక జలపాతం వద్దో - చంద్రాన్ని తలంటి నీళ్ళు పోసుకోమని చెప్పు. ఎన్నాళ్ళయిందో ఆ మనిషి ఒంటికి నూనె రాసుకొని! ఆయనగా ఏదీ పట్టించుకోరు. నువ్వు దగ్గరుండి తలస్నానం చేయించు కిట్టప్పా. అడగడం మరచాను. ఆయన మధ్యాహ్నం భోంచేశారా?"

"లేదమ్మా! హోటల్లో పట్టుకెళ్ళిన అన్నం

అక్లే వడి ఉంది. పొద్దున టిఫిన్ తిని అడవిలోకి వెళ్ళినారు. వగలంతా గుట్టుగా ఎవురెవురితోనో మాట్లాడుతూ గడిపినట్లుంది. పొద్దు గూకంగా పెద్దుకు వచ్చినారు. రేత్రికి ఒకేసారి భోం చేత్త నన్నారు."

"కిష్టప్పా! ఆయన ఏమైనా చెప్పారా?"

"ఏం చెప్పలే దమ్మా! సీత ఏమైనా చెవుతుందేమో తెలుసుకొనిరా" అన్నారు.

"ఏం చెప్పేది కిట్టప్పా? బాబు నాన్నను చూడాలని కలవరిస్తున్నాడు. 'నాన్న ఎవు డొస్తా డమ్మా!' అంటూ రోజుకు రెండు సార్లయినా అడుగుతాడు. బిడ్డకు ఏం జవాబు చెప్పను? బొంకుతూ వసిబిడ్డను ఎంత కాలమని మభ్యపెట్టను? ఆయన్ను రాత్రికి వచ్చి బాబుకు కనవడి పొమ్మని చెవ్పనా? వచ్చి కనవడ్డారా అ దే ప్రమాదం! పొద్దున్నే వీధి పిల్లలతో మా నాన్న వచ్చాడు, మా నాన్న వచ్చాడు అంటూ నంతోషంతో చప్పట్లు కొట్టి చెప్పేస్తాడు. వసిబిడ్డ, వాడి కేం తెలును? రెప్పపాటులో వార్త పోలీసుల చెవికి చేరుతుంది. ముప్పు ముంచుకొస్తుంది.

"బాబుకు మనుమల గుర్తింపు వచ్చింది మొదలు తన తండ్రిని చూడనేలేదు. ఆయన ముఖ మె ట్లుంటుందో కూడా ఎరుగడు. బిడ్డకు తండ్రిని చూపెట్టాలని తల్లిగా నే నెంతో తవన వడుతున్నాను. చంద్రాన్ని ఇంటికి రమ్మనీ పిలువలేను. వద్దనీ చెప్పలేను. నందిగ్ధంలో వడి ఊగిసలాడుతున్నా. కిట్టప్పా! ఆయనతో చెప్పు - సీతమ్మ ఏమీ చెప్పలేదని. కాదు, చెప్పలేకపోయిందని చెప్పు. అంతే! అంతే...!"

సీతమ్మకు తెరలు తెరలుగా దుఃఖం తోసుకొచ్చింది. చెరుగుతో కళ్ళు ఒత్తుకుంటూ చాటుకు వెళ్ళింది.

కిట్టప్ప కారియరు, నూనె, శీకాయ పొడి తీసుకొని మౌనంగా వెళ్ళిపోయాడు.

ఆ రాత్రి సీతమ్మ అన్నమూ తినలేదు. కంటికి నిద్రా పోలేదు. ఎటూ తెగని ఆలోచనలు.

బాబు కడుపులో వడ్డప్పటి నుండీ ఆమెకు కష్టాలు ఎక్కువయ్యాయి. చంద్రం పోలీసుల కంట బడకుండా తప్పించుక తిరుగుతున్న రోజులు. అప్పుడు రెండు రాత్రులు రహస్యంగా ఇంటికి వచ్చి వెళ్ళా రు. తనకు గర్భం నిలిచింది. బాబు పుట్టాడు. అపవాదుకు గురయ్యింది. 'భర్త లేడు, కడు పెట్లొచ్చిందీ? అక్రమ నంతానమే' అంటూ అయినవారూ, కానివారూ ఆడిపోసుకున్నారు. మొగుణ్ణి ఇంటినుండి తరిమేసింది. ఎవడితోనో నంబంధం పెట్టుకుంది' - అని తన పుట్టింటి ఆడవడుచులే అభాండాలు వేసినారు. కాన్పుకు కూడా తీసుకపోలేదు. నిందలు భరించలేక ఆత్మహత్య చేసుకుందా మనుకున్నది. కానీ అప్పటికి మామయ్య బ్రతికి ఉన్నారు. ఆయనకు నిజం తెలును. తనకు అండగా నిలిచారు. ధైర్యం చెప్పారు. చిత్తూరుకు పిలుచుకొని పోయి నర్సింగ్ హోమ్‌లో కాన్పు చేయించారు. మనమణ్ణి చూసుకొని మహదానందం పొందారు. మామయ్య దేవుని లాంటివారు. వారు బ్రతికుంటే తనకు కొండంత అండగా ఉండేవారు. ఆ అదృష్టానికి నోచుకోలేదు.

మరో రెండేండ్లకు అలాంటి నంఘటనే ఒకటి ఎదురైంది. పోలీసులు తీవ్రవాదుల్ని ఎక్కడ బడితే అక్కడ పిట్టల్ని చంపినట్లు కాల్చిపారేస్తున్న గడ్డు దినాలు. చంద్రాన్ని కనిపిస్తే కాల్చి పారేయమని ఉత్తర్వులు జారీ అయిన కాలం. ఆ నమయంలో ఒక రోజు రాత్రి చంద్రం ఇంటికి వచ్చినారు. బాంబులు పట్టుకున్న ఇద్దరు యువకుల్ని ఇంటి బైట కాపలా పెట్టి వచ్చారు. అప్పుడే ఆయన చిన్న బిడ్డ బాబును తొలిసారి చూసిందీ, చేరదీసి ముద్దాడిందీ. చీకట్లోనే తిరిగి వెళ్ళిపోయారు.

శనికాలం! అప్పుడూ నెల తప్పింది. క్రుంగిపోయాను. కుమిలిపోయాను. నిందలతో, నిష్ఠూరాలతో లోకం మళ్ళీ నన్ను కాల్చు తింటుంది. ఈ దోషం కడిగేసుకొనే మార్గం? తను ఒంటరిది. ఒక విధంగా అనాథ. ఎవరి సాయం తీసుకోవాలి - అని తనలో తాను వాపోతున్న నమయంలో అపద్బాంధవుడిలా మాస్టారు ఇంటికి వచ్చారు. తండ్రి లాంటి మాస్టారుతో గోప్యంగా తన గోడు చెప్పుకుంది. ఆయన తన్ను తిరుపతికి తీసుకెళ్ళి అబార్షన్ చేయించారు. వారం దినాలు తన ఇంటిలో పెట్టుకొని బాగుచేయించి పంపారు.

మాస్టారు తనకు ఇంటరులో గురువు. చంద్రానికి రాజకీయ గురువు. మంచివారు. మేధావి. మానవతా వాది. పౌర హక్కుల నంఘం అధ్యక్షుడుగా తరచూ జిల్లాలో పర్యటిస్తుంటారు.

ఆయన అండర్ గ్రౌండ్ కెళ్ళిన ఏడేండ్ల కాలంలో ఆ రెండుమార్లే ఇంటికి వచ్చింది. ఏడాదిన్నర పిమ్మట ఇప్పుడు మళ్ళీ ఈ ప్రాంతం వచ్చినారు.

సీతమ్మ రాత్రంతా ఆవేదనతో ఆలోచనలతో గడిపింది. తెల్లవారుజాముకు కునుకు పట్టబోతుండగా కిట్టప్ప వచ్చి తలుపు తట్టాడు. తలుపు తీసింది.

"సీతమ్మా! ఈ రోజు రేతిరికి చంద్రయ్య చోటు మారుస్తారంట" అన్నాడు.

"అంటే?" అర్థంగాక అడిగింది.

"మరో చోటకి మకాం మారుస్తారం టమ్మా. ఈడనుండీ ఓలబారిపోతారు. అదీ నంగతి. చెప్పి పోదామని వచ్చాను."

సీతమ్మ స్తంభించింది. ముఖం నిస్తేజమైంది. లిప్తకాలం . నిశ్చలంగా నిర్నిమేషంగా నిలుచుండిపోయింది. పిమ్మట యంత్రంలా కదిలి గదిలోకి వెళ్ళింది. తిరిగి వచ్చింది.


"కిట్టప్పా! చింతకాయలు అమ్మిన డబ్బు కొంత ఇంటిలో ఉంది. ఆయన దేశాలు తిరుగుతుంటారు. చేతిలో డబ్బు ఉంటే ఎందుకైనా మంచిది. ఈ వెయ్యి రూపాయలు తీసుకెళ్ళి చంద్రానికి ఇవ్వండి" అని చెప్పి పది నూరు రూపాయల నోట్లు కిట్టప్ప చేతిలో పెట్టింది. సీతమ్మ వైఖరి కిట్టప్పకు వింతగా తోచింది. అయోమయంలో వడ్డాడు. ఆమె అంతరంగం ఆయన కేమీ బోధవడలేదు. నిరాశా నిస్పృహలతో బరువుగా వెళ్ళిపోయాడు కిట్టప్ప.

** ** **

ఆలుమగలు ఒకర్నొకరు చూసుకుంటే - కలిసి మాట్లాడుకుంటే బాగుంటుందని కిట్టప్ప ఆలోచన. ఆదుర్దా. అందుకు గాను ఆ రాత్రికి ఊరి పొలిమేరలో ఉన్న బువ్వమ్మ ఇంటిలో ఇద్దరూ కలుసుకునేందుకు ఏర్పాటు చేసినాడు కిట్టప్ప. బువ్వమ్మ బాబు దగ్గర ఉండి సీతమ్మను పంపించింది.

గుండుకు గుండె ఎదురొడ్డి - మెడకు ఉరితాడు తగిలించుకొని పోరు బాటలో పయనిస్తున్న విప్లవవీరుడు చంద్రం. తన కష్టాలు, గాథలు ఆయన ముందు అంగలార్చి భర్త మనను నొప్పించగూడ దనుకున్నది సీతమ్మ. కానీ ఆయన కంట బడుతూనే అమాంతంగా భర్తను చుట్టేసి భోరున ఏడ్చేసింది. ఏడేండ్లుగా అణచిపెట్టుకున్న దుఃఖం, దాచుకున్న కన్నీరు ఒక్కసారిగా పెల్లుబికి ఆ ఇల్లాల్ని అబలను చేసేశాయి.

చంద్రం తనదైన ధోరణిలో సీతమ్మకు నచ్చచెప్పాడు. "నా మూలంగా నువ్వు కష్టాలు వడుతున్నావని తెలును. ఈ బాధలు ఊహించనివేం కాదు. నహజమైనవే. చర్య ప్రతిచర్య క్రమంలోని పరిణామాలే. విప్లవకారుల



కుటుంబాలు కొన్ని త్యాగాలు చెయ్యక తప్పదు. కానీ; మనిషి తన కష్టాల్ని బాధల్ని లోకానివిగా భావించి వాటి నివారణకు జనంతో కలిసి కృషి చేయాలి. నువ్వు నీ కష్టాల్ని గురించి అతిగా ఆలోచిస్తుంటావు కాబోలు. కాబట్టి అధికంగా ఆవేదనకు లోనవుతుంటావు. సీతా ! పేద బిడ్డల్ని చేరదీసి వారికి చదువు చెప్పు. ఏ ఆధారం లేని ఆడవాండ్లకు అల్లిక, కుట్టు పని లాంటివి నేర్పించు. తద్వారా నీకు కొంత ఊరట, ఉపశమనం కలుగుతాయి.''

చంద్రం • యథార్థం చెప్పాడు. వాస్తవాల్నే వివరించాడు. కావచ్చు. కానీ బాధతో విలవిల్లాడుతున్న రోగికి ఔషధం ఇవ్వకుండా వట్టి ఓదార్పు మాటలు చెపుతున్న వైద్యుని విధంగా ఉండింది చంద్రం మాట తీరు.

సీతమ్మ మారుమాట్లాడకుండా మౌనంగా ఉండింది. ఇద్దరూ వీడిపోయే ముందు - ''బాబుకు వచ్చే సోమవారం నాలుగో ఏడు వడుతుంది'' అన్నది సీతమ్మ.

''బాబు ఆరోగ్యంగా బాగా ఆడుకుంటున్నాడా?''

''అది కాదు, బాబుకు ఈమారు బర్త్‌డే సెలబ్రేట్ చెయ్యాలి.''

''ఎప్పుడూ లేంది. ఇప్పు డేంది కొత్తగా? ఈ పిచ్చి నీకూ వట్టుకుందా?''

''నాకు వట్టలేదు. లోకానికి వట్టింది కదా ! నేనేం చెయ్యను? మ నింటి వక్కన ఓ పెద్ద ఆఫీనరు చేరినాడు, ఆయన తన రెండేండ్ల కొడుక్కి పెద్దయెత్తున బర్త్‌డే జరిపించినాడు. ప్రెజంటేషన్లు కుప్పగా వడినాయి. అది చూచినాడు బాబు. 'నాకూ బత్తుడే చేయమ్మా! బిస్కెట్లు, పప్పరమెంట్లు, కేకులు, బొమ్మలు దండిగా వత్తాయి' అంటూ మరీ మరీ అడిగినాడు. మీ నాన్న వస్తారు. అప్పుడు తప్పక చేస్తాంలే బాబూ అని అప్పటి కేదో అట్లా నర్ది చెప్పినాను. అప్పటినుండీ నాన్న ఎప్పుడు వత్తాడు, నాకు బత్తుడే యెప్పుడు చేత్తవు అని రోజూ అడుగుతున్నాడు. న న్నేం చెయ్యమంటారు! వసిబిడ్డ కోరిక...''

''బాబు వసిబిడ్డే. కానీ నువ్వూ వసిబిడ్డగా మాట్లాడుతున్నావు. ఇలాంటి సెంటిమెంట్లకు, నంప్రదాయాలకూ ఎప్పుడూ చోటివ్వకూడదు. సేట్లు, షావుకార్లు, బడా ఆఫీనర్లు తమ అంతన్తును, ఔన్నత్యాన్ని చాటుకొనేందుకు ఇలాంటి భేషజాలకు పోతుంటారు. ఇదో ఫ్యూడల్ దుష్ట నంప్రదాయం. ధనికుల విన్యానం. బర్త్‌డేలు, నామకరణాలు, షష్టిపూర్తులు ధనస్వామ్యం వికృత నంన్కృతికి ప్రతీకలు. తెలియక ఇతరులు కూడా ఈ వ్యామోహానికి తలొగ్గుతున్నారు'' అని చంద్రం విచారం వెలిబుచ్చాడు.

పిమ్మట కొంతసేపటికి ఇద్దరూ వీడిపోయారు. రెండు శూన్యాలు ముఖాముఖి దగ్గరగా వచ్చి, తిరిగి వెనక్కు పోయినట్లు.

తెల్లారింది. పొద్దెక్కింది. వదయింది. మామూలుగా టిఫిన్ తెస్తా డనుకున్న కిట్టప్ప రాలేదు. చంద్రం తానే వాచ్‌మాన్ షెడ్డుకు వెళ్ళి చెల్లమ్మను అడిగినాడు.

''ఆయన కొడుకు బత్తుడే నంబరంలో మునిగి ఉండా డన్నా. ఈ దినం దేవుడు దిగొచ్చినా యెవరికీ వలకడు. యే వనీ చెయ్యడు. పొద్దుటంటా అబ్బా కొడుకు లిద్దరూ మడుగు కెళ్ళిండారు. చావలు వట్టుకొచ్చిండారు. కూర వండుకుండారు. సారాయి తెచ్చుకుండారు. బంగళాలో కెళ్ళి కూచుండారు. బంగ్లా కొచ్చే దొరల్ని నూసి ఈయనా బిడ్డ బత్తుడే మోజులో వడిండాడు. యెళ్ళి ఆళ్ల అవతారం మీరే నూడండి.'' చెప్పింది చెల్లమ్మ మొగుడి ముచ్చట్లకు నొచ్చుకుంటూ.

చంద్రం బంగళాకు వచ్చి, వరండాలో నిలబడి కిటికీలో గుండా లోనికి చూచినాడు-

కిట్టప్పా, ఏడేండ్ల కొడుకు రాములు ఎదురుబొదురుగా కూచొని ఉన్నారు. వారి ముందు రెండు నత్తు గ్లానుల్లో సారాయి ఉంది. తాగుతూ చేపలు నంజుకుంటూ మత్తులో మునుగుతూ తేలుతూ ఉన్నారు.

''ఒరే రాములూ? ఈ షావుకారి నాకొడుకులేనా బత్తుడేలు చేనుకుండేది? మనం సేనుకోలే మాంట? వురే కొడకా! నువ్వు బేగీ పెద్దోడివై, డైవరై, లారీ యెక్కెరా! అప్పుడు జూడరా మన తడాఖా! ఆఫీనరగాళ్ళ తలదన్నేట్లుగా చేత్తరా నీ బత్తుడే!'' అంటున్నాడు కిట్టప్ప. నిషాలో ఒక ర్నొకరు తడుముకుంటున్నారు. కౌగిలించుకుంటున్నారు. పొర్లుతున్నారు. అనంద లోకాల్లో తేలియాడుతున్నారు.

చంద్రంఆ దృశ్యాన్ని చూచినాడు. నిశ్చలంగా నిలబడి చూచినాడు. నిశితంగా చూచినాడు. నిర్వికారంగా చూచినాడు.

అప్పు డాయన దృష్టికి సారాయి కనబడ లేదు. నంప్రదాయం కనబడలేదు. తాగుడు చెడ్డా కనబడలేదు. మురికి కనబడలేదు. ముత్యమే కనబడింది.

తండ్రీ తనయుల సాన్నిహిత్యం, తన్మయత్వం, వాత్సల్యం, పెనవేనుకున్న పుత్ర ప్రేమ, పితృప్రేమ మాత్రమే కనబడినాయి. ఓ తండ్రీ - తనయుల అద్వైతానుభూతి కనబడింది.

క్రమశిక్షణలో కష్టాల్లో, కారడవుల్లో, పోరాటంలో రాటు దేరి గట్టివడిన ఉక్కు మనిషి కామ్రేడ్ చంద్రం. అయినా ఆ ఉక్కు శరీరంలో ఉండేది ఓ మెత్తని గుండె. అది ఆ క్షణంలో చలించింది. హృది ఆర్ద్రమై తరళితమైంది.

చంద్రం చటుక్కున వెనుదిరిగి షెడ్డు వద్దకు వెళ్ళాడు. చెల్లమ్మను పిలిచి చెప్పాడు - ''చెల్లమ్మా! సోమవారం బాబుకు పుట్టిన పండుగ పెట్టుకోమని సీతతో చెప్పు. ఆ రోజు నేను ఇంటికి వస్తానని చెప్పు. కొంతకాలం ఇంటిలో ఉంటానని కూడా చెప్పు. చిత్తూరుకు పోయి జిల్లా కోర్టులో హాజరై బెయిలు మీద సోమవారం ఇంటికి చేరుకుంటానని చెప్పు'' అని చెప్పి వెళ్ళిపోయినాడు చంద్రం.

అబ్బా! ఇన్నాళ్ళకు సీతమ్మ నోము పండింది. ఇంగ చంద్రన్న ఇంటికి వచ్చేత్తాడు అనుకుంటూ చెల్లమ్మ తృప్తిగా ఊపిరి పీల్చింది.

** ** **

సోమవారం బాబు బర్త్‌డే. సీతమ్మ బాబుకు ఉదయమే తలంటి స్నానం చేయించింది. కొత్త బట్టలు తొడిగింది. బువ్వమ్మా, తానూ ఓ వక్క పండుగ ఏర్పాట్లు చేనుకుంటూ, మరో వక్క చంద్రం రాకకు ఎదురు చూస్తూండారు. 'మా నాన్న వత్తాడు. దండిగా బొమ్మలు తెత్తాడు. నాకు బత్తుడే చేత్తాడు' అంటూ బాబు ఉల్లాసంగా గంతులేస్తున్నాడు.

ఆ నమయంలో వక్కింటి పెద్దాయన అప్పుడే వచ్చిన పేవరు తెచ్చి సీతమ్మకు చూపెట్టాడు. మొదటి పేజీలో బాక్స్ కట్టి వేసిన వార్త చూచింది సీతమ్మ.

''ప్రముఖ నక్సలైట్ లీడరు చంద్రం - చంద్రమౌళి ఉరఫ్ రెడ్డన్న నిన్న రాత్రి మామండూరు అడవుల్లో పోలీను ఎదురు కాల్పుల్లో మరణించాడు. అతని వద్ద కొంత డబ్బు, కొన్ని మారణాయుధాలు, కొంత విప్లవ సాహిత్యం పోలీనులకు దొరికాయి.''

పేవరులోని అక్షరాలు సీతమ్మ తలమీద బాంబులై పేలాయి. ఆ వార్త కాలనాగులా ఆమె గుండెను కాటేసింది. ''బాబూ!'' అని ఆక్రోశిస్తూ ఆమె నేలమీద కుప్పగా కూలిపోయింది.

కామ్రేడ్ చంద్రం మరణ వార్త తెలునుకున్న మాస్టారు మరుక్షణమే బస్సెక్కి హుటాహుటి నెరబైలు వచ్చి, సీతమ్మ ఇంటికి చేరుకున్నాడు.

కాలం కాటేసిన బిడ్డ తల్లి సీతమ్మ శవం - విధి లిఖించిన వెర్రి చిత్రంలా మంచం మీద వడి ఉంది.

దిగులు, జాలి, సానుభూతి రూపెత్తిన బువ్వమ్మ బాబును ఒడిలో పెట్టుకొని ఓ మూలగా కూర్చొని ఉంది.

పెను గాలికి చెట్టు నుండి తెగివడి - గుడ్లు, పిల్లలు, పుల్లలు చెల్లా చెదురైన వక్షి గూడులా ఉంది ఆ ఇంటి వరిస్థితి.

మాస్టారు సీతమ్మ శవానికి గుడ్డ కప్పాడు. బువ్వమ్మ దగ్గరికి వెళ్ళాడు. వసిబిడ్డ బాబును చేతుల్లోకి తీనుకున్నాడు. తన భుజం మీద వడుకోబెట్టుకున్నాడు.

'చరిత్ర కెక్క నేరని ఇలాంటి చారిత్రక నంఘటనలు ఎన్నో ఇంకెన్నో!' - నిర్వేదంతో నిట్టూర్చాడు మాస్టారు. ★

---

విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ 1912లో లండన్ వెళ్ళినప్పుడు తాను రచించిన 'గీతాంజలి' ఆంగ్లానువాదం ఉన్న బ్రీఫ్‌కేనును ఆయన వయనించిన అండర్ గ్రౌండ్ రైల్వే కోచ్‌లో మరిచిపోయాడు. మరునాడు రైల్వే అధికారులకు రిపోర్టు ఇవ్వగా ఆ బ్రీఫ్‌కేస్ లాస్ట్ ప్రావర్టీ రికవరీ కార్యాలయంలో భద్రంగా ఉన్నట్లు తెలిసి దాన్ని తీనుకొని వచ్చారు. మరునటి నంవత్సరం అంటే 1913లో ఆ పుస్తకానికి [గీతాంజలి] నోబెల్ బహుమతి లభించింది.

వి.విజయలక్ష్మిరెడ్డి [ప్రొద్దుటూరు]